# ఏటి మొగదల కడలి అంచున

ము ప్పాడు సంవత్సరాల క్రితం—

పోసిన నారుమళ్ళు చక్కగా పచ్చగా ఏపుగా పెరిగి, నాట్లకు సిద్ధంగా వున్న రోజుల్లో మబ్బు పట్టిన ఓ సాయంకాలం - ఆకాశంలో తెల్లని కొంగలు బారులుతీరి ఎగురుతున్నాయి. సస్యలక్ష్మి పచ్చనిపైట గాలికి రెపరెప లాడుతున్నట్టు తూర్పుగాలికి నారుమడి తలఊపుతుంటే, బోదెలు సస్యలక్ష్మి పాపిట అనిపించింది. అది అప్పటి మాట. కృష్ణగట్టు ప్రక్కన, ఏటి మొగదల వున్నగ్రామం కాబట్టి ఏటిమొగ కావచ్చు - అప్పుడు పరవశించిన మనసు ఈరోజు - కడలి విలయావర్తపు చిహ్నాలను చూచినపుడు మౌనశోకానికి గురికాకతప్పడంలేదు.

ఏటిమొగ గ్రామం తుపాను ఉప్పెనల సంయుక్తగర్జనలకు, తాడన పీడనలకుగురై రూపు రేఖలు పూర్తిగా మారిపోయి, ప్రాచీన వైభవాన్ని గుర్తుకుతెచ్చే శిధిలంగా మిగిలింది. ఆవూరి శివార్లలో చినకమ్మవారిపాలెం, పెదకమ్మవారిపాలెం, గుల్లలమోద గ్రామాలు పిల్లలు ఆడి ఆడి విసిగి చిందరవందర చేసిన ఆటబొమ్మలుగా మారిపోయి, నాయి.

ఏటిగట్టు పేరుకు కరకట్ట. అది ఎత్తుకు ఆరడుగులకుకొంచెంపైనే వుండవచ్చు.కానీ 1977 నవంబరు 19 వ తేదీ సాయంత్రం అయిదున్నరకు ఏటి మొగదల గల ఏటిమొగ గ్రామ నివాసులకు జీవితవారధి ప్రాణాలను కాపాడిన పుణ్యస్థలి.

ఏటిమొగ పేరుకు వూరే. నిజానికివూరుపేరు లేకుండా పోయిన ప్రాంతాలకంటె ఈరోజు ఏటిమొగ సలక్షణంగానే వుందనవచ్చు. కాని: చిన్నా చితక, ముసలి ముతక ఆబాలగోపాలం ఉప్పెనరోజురాత్రి చలిలో, చీకటిలో ఆకలిలో అందరూ వున్నా వంతరిగా చావు బతుకుల జీవిత విభావరిలో చేసిన ఆక్రందనలకు ప్రతిధ్వనులా అన్నట్టు గట్టుకింద ఇప్పటికీ కాలుతున్న జంతు కళేబరాలు, కపాలమోక్షాల మ్రోతలు వినవస్తూనే వున్నాయి.

ఏటి మొగకు ఎగువ సుమారు అరమైలు దూరంలో చినకమ్మవారిపాలెం, పెద కమ్మవారి పాలెంఅని రెండుగ్రామాలు వున్నాయి. శనివారం సాయంత్రం మహోధృతంగా దక్షాధ్వరధ్వంసమూర్తి ప్రళయగర్జనలవలె, మృత్యుదేవత పిచ్చికేకలవలె, పిల్లదయ్యాల ఏడుపులవలె, రాక్షసుల నవ్వులా అన్నట్టు వీస్తున్న ప్రభంజనాలధాటికి తట్టుకోలేక ప్రాణాలుఅరచేతిలో పెట్టుకొని అంతస్తులు, అరమరికలు, వైషమ్యాలు సర్వం మరచి

## వరద కథలు

ముక్తకంఠంతో ఆస్తినాస్తి విచికిత్సమాని ప్రాణాలు కాపాడమని రూపురేఖలులేని ఆర్తత్రాణ పరాయణునికోసం భజనలుచేస్తూ గడపారు. దూరాన ఘోష, గర్జనలతో మృత్యురూపం ధరించిన ఉత్తుంగ తరంగం ఆఘ మేఘాలమీద వీస్తున్నది. జడలువిచ్చి, సుడులు తిరిగి కడలి క్రోధంతో ఊళ్ళూనాళ్ళూ కలిపి దాదాపు పన్నెండుమైళ్ళ మేరకు సర్వనాశనంచేసి ఇక చేసేదిలేక కృష్ణలో కలవడానికి వస్తున్నది. చినకమ్మవారు పెదకమ్మవారు అందరూ వారూవీరు సంపన్నులు పేదలు ఆపన్నులైనారు. కక్షలు లేవు, కార్పణ్యాలులేవు. అందరు ఊరికి పట్టుమని నాలుగడుగులదూరంలో వున్న గట్టు మీదకు చేరడానికి పడినఅవస్థ వింటుంటేనే ఒడలు గగుర్పొడుస్తుంది.

గట్టు వెడల్పు నాలుగడుగులు ఆ గట్టు ఎక్కడానికి వారు పడిన అవస్థ వింటుంటే ఒక కథ గుర్తుకువస్తుంది.

మహా పాపాలు చేసిన సిసిఫియస్‌కు మరణానంతరం భగవంతుడు శిక్షవేస్తాడు. ఒక బండరాయిని పెద్ద కొండపాదాలనుంచి పైకి ఎక్కించి శిఖరానికి చేర్చిన ఉత్తరక్షణమే పుణ్యం ప్రాప్తిస్తుందని, శిక్ష తొలగుతుందని దేముడు అంటాడు. ప్రతి తడవా సునాయాసంగా కొండకొమ్ముఒక్క అంగుళంలో ఉందనగా బండరాయి క్రిందకు దొర్లేదట. ఆరోజు ఆ గ్రామవాసులు అంత అవస్థ పడ్డారట. మాములుగా పారాడే పసిపిల్లలు ప్రాకుతూ ఎక్కేగట్టు అది. ఆరోజు పాతికమంది కలసి ఆ గట్టు జట్టుగా కట్టుగా కండబలం, గుండెబలం కరిగేట్టుగా ప్రయత్నించినా ఎక్కడానికి దాదాపు గంటసేపు పట్టిందట. ఏమైతేనేం ఈ భూమి మీద నూకలు వున్నవాళ్ళు ఈ చచ్చిపోయిన వాళ్ళకోసం ఏడిచేందుకు, బాధలు పడేందుకు ప్రభుత్వం సహాయంకోసం వున్నామంటున్నారు.

కళ్ళముందు కాళ్ళక్రింద నేలకోసుకుపోతుంటే నాలుగడుగుల వెడల్పుకూడా లేని గట్టుమీద వెనక్కు జరగడం అంటే ఏట్లో పడిపోవడమే. ముందుచూస్తే సముద్రం సముద్ర తరంగం రూపంలో మృత్యువు. వెనుక చూస్తే కల్లోలితమైన నది. అందుకు కొన్ని క్షణాలముందే సుమారు ఫర్లాంగు దూరంలో ఏటి మొగకు దగ్గరగా వందగజాల మేరకు గండి పడిందని. తెలిసిన వాళ్ళు, తెలియనివాళ్ళు, సంపన్నులు, పేదలు, కుక్కలు, గేదెలు, పందులు కలసి వెరసి జీవజాలం ఏట్లో పడిపోయాయి.

"నదీనాం సాగరో గతిః" అంటారు. కాదు ఆరోజు సాగరమే నదిలో కలిసింది ఏటి మొగ వద్ద.

ఊరు మొదట ఒకఇల్లు, అందులో నలుగురు వున్నారు. ప్రళయ సదృశంగా వస్తున్న తరంగాన్నిచూసి ఊళ్ళోకివద్దామని గాలికి ఎదురీదుకురావడానికి చేసిన ప్రయత్నంలో నలుగురు పదిగజాల దూరంలోవున్న చెరువులో పడిపోయారు, తెల్లారే సరికి నాల్గు శవాలు కన్పించాయి.

ఊరంతటికి జీవనాధారమైన (జీవనం అంటే త్రాగేనీరు) ఆ చెరువు ఈరోజు త్రాగడానికి వీలులేకుండా పోయింది.

సైన్యానికి చెందిన ఇంజనీరింగ్ నిపుణులు ఇంజన్లుపెట్టి నీరు తోడేస్తున్నారు.

అసలు ఆ వూరి జవసత్వాలను సముద్రం ఏనాడో తోడేసింది.

—లంక వెంకటరమణ



తుపాను రోజు ఉదయం 19-11-77 తుపాను రావడానికి ముందు విజయవాడలో ఇంత అమాయకంగా ప్రారంభమయిన ఉదయం